క్లుప్తంగా

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ముగ్గళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ముగ్గళ్లలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఉదయం 4 గంటల నుంచి భక్తుల రాక మొదలైంది. ఆషాఢమాసంలోని మంగళవారం షష్ఠి తిథి కారణంగా భక్తులు పలు రకాల ద్రవ్యాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేయించారు. అర్చకులు కొడమంచిలి వినేష్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సీతానగరం, రఘుదేవపురం, మునికూడలి తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

లంక భూములను పేదలకు పంపిణీ చేయాలి



చీపురుపల్లిలో పర్యటిస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

సీతానగరం: ప్రభుత్వానికి చెందిన పోడు, సీలింగ్, లంక భూములను నియోజకవర్గంలోని పేదలకు సాగు చేసుకోవడానికి పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం చీపురుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగంపల్లి, చీపురుపల్లి, పెదకొండేపూడి, సీతానగరంలోని లంకభూములను నిరుపేదలకు అందజేయాలన్నారు. ఈనెల 4న అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని సీతానగరంలోని పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు. పోడు భూములను భూస్వాములు ఆక్రమించుకుంటున్నారని ధ్వజమెత్తారు. గిరిజన, పేద రైతుల వ్యక్తిగత దరఖాస్తులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో భూమి లేని రైతులతో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని వంగలపూడికి చెందిన టి.వెంకట శ్రీనివాసరావు (38) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసరావుకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. అయితే భార్య పుట్టింటిలో ఉండడంతో మనస్తాపానికి గురై గత నెల 22న పురుగు మందు తాగేశాడు. దీంతో అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ తెల్లవారుజాము 3.30 గంటలకు మృతి చెందాడు. శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

డైట్ అధ్యాపకులు, సిబ్బందికి సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో పనిచేసి, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అధ్యాపకులు, ఇతర సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అన్నారు. ఈ మేరకు మంగళవారం బొమ్మూరు డైట్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. బదిలీ అయిన అధ్యాపకులు, ఇతర సిబ్బందిని శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. డైట్ అధ్యాపకులు సుజాతా రత్నం, జానకీ దేవి, గంగాధర్, ఎస్తర్, కళావతి సత్యనారాయణతో పాటు అధ్యాపకేతర సిబ్బంది ప్రసాద్, చాందినీ, తేజ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో వీరందరినీ సన్మానించారు. అలాగే వివిధ పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై డైట్‌కు అధ్యాపకులు, సిబ్బందికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, సూర్యనారాయణ, రఘుబాబు, రామకృష్ణ, రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సల్మా, కిరణ్మయి, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు భద్రం మృతి



కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సూరిశెట్టి భద్రం (60) మంగళవారం మృతి చెందారు. స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు నివాళులర్పించారు. గణేష్ మాట్లాడుతూ భద్రం శ్రీరంగపట్నంలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఫొటోగ్రాఫర్‌గా కార్మికులు, రైతుల కష్టాలను ప్రజలకు చూపించారన్నారు.

అదిగో.. ఇదిగో..

- అన్నదాత సుఖీభవపై కూటమి నిర్లక్ష్యం
- రైతులకు దక్కని పెట్టుబడి సాయం
- సాగు పనులకు తీవ్ర ఇబ్బందులు
- జగన్ ప్రభుత్వంలో ప్రతి ఏటా అమలైన రైతు భరోసా



ఖరీఫ్ సాగు కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

పెదపూడి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండగా సాగేది. సీజన్ ప్రారంభానికి ముందు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేసేది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేది. విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని విధాలా సహకరించేది. అన్నదాతలు ఎంతో ఉత్సాహంగా సాగు పనులు చేపట్టేవారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో రైతులకు సాయం అందడం లేదు. ఎన్నికల సమయంలో వారిచ్చిన హామీలకు, నేడు అధికారంలోకి వచ్చాక చేస్తున్న పనులకు సంబంధం లేదు. ముఖ్యంగా వ్యవసాయానికి పెట్టుబడి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరు మార్పుతో సరి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం కింద ఏటా ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. కానీ రైతులకు సాయం చేయడం మరిచిపోయారు. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేవి. కూటమి పెద్దలు మాత్రం రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించి చేతులు దులుపేసుకున్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా పథకం అమలు ఊసేలేదు.

కాలయాపన

అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్న నేటికి విధివిధానాలు వెల్లడించడం లేదు. దీన్ని బట్టే పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. గత జూన్ నెలలో చివరి రెండు వారాల్లో తేదీలు ప్రకటించినప్పటికి నేటికీ అమలు కాలేదు. ఇప్పటికైనా ఆ పథకాన్ని అమలు చేసే ఉద్దేశముందా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడంతో అన్నదాతల చేతిలో చిల్లిగవ్వలేక సాగుకు అప్పులు చేయాలి వచ్చింది.

కౌలు రైతులకు దక్కని భరోసా

కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవి అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

రైతులకు అండగా..

ఏడాది క్రితం వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతలకు భూసార పరీక్షల నుంచి దిగుబడులకు మద్దతు ధరకు కొనుగోలు చేయడం వరకూ అండగా నిలిచింది. ఇక ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు జగన్ ప్రభుత్వం పరిహారం అందజేసింది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం కింద ఏడాది రూ.13,500 నగదు సాయం రైతుల ఖాతాల్లో జమ చేసేది. నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 12 వేలు, బిక్కవోలులో 13 వేలు, పెదపూడిలో 18,500, రంగంపేటలో 6,200 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు.

ఒక్క పైసా అందలేదు



"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు ఒక్క పైసా కూడా జమ చేయలేదు. గత ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా పథకం వచ్చింది. విత్తనాలు, ఎరువులు సైతం రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవి. ఎరువుల కోసం పెట్టే ప్రయాణ ఖర్చులు మిగిలేవి. ఇప్పుడు ఆ ఊసే లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట సాగుకు ముందు రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందడంతో రైతులు ఆనందంగా సాగు చేపట్టేవారు. ఇప్పుడు ఆ పథకం అందక ఇబ్బందులు పడుతున్నారు."

– మార్ని వెంకట్రావు, రైతు, పెదపూడి

రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

- పెట్టుబడి సాయం రూ.40 వేలు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

బిక్కవోలు: రైతులకు సీఎంఆర్ ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం రైతులతో కలసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మే నెలలో రబీ ధాన్యాన్ని సీఎంఆర్ పథకం ద్వారా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కానీ దాని సొమ్ములు మాత్రం ఇప్పటికీ రైతులకు అందలేదన్నారు. దాదాపు రూ.11 కోట్లు రైతులకు రావాల్సి ఉందని తెలిపారు. గత రెండు నెలల నుంచి ప్రభుత్వం ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ఎన్నికల హామీ అమలెప్పుడు!

రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక విస్మరించారని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఉంటారు. ఈ నేపథ్యంలో రెండేళ్లకు కలిపి రైతులకు రూ.40 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే సీఎంఆర్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 24 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని చెప్పి, రైతులకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఎమ్మెల్యే స్పందించాలి

రైతులకు ధాన్యం బకాయిల విషయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పందించాలని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కానీ ఆయన కక్ష సాధింపు రాజకీయాలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. మిల్లర్లతో ఎమ్మెల్యే కుమ్మక్కు కావడంతో రైతు ఎకరానికి సగటున రూ.10 వేల వరకూ నష్టపోతున్నారన్నారు. రైతులకు తక్షణమే బకాయిలు విడుదల చేయకుంటే వైఎస్సార్ సీపీ పక్షాన రైతుల కోసం ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకటరమణ, పందలపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, కొంకుదురు సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, మోల్లారు ఉప సర్పంచి కొమ్మన ఆనంద్, కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ, గువ్వల సత్తిరెడ్డి, బలభద్రపురం గ్రామ శాఖ అధ్యక్షుడు కొవ్వూరి వెంకట రామారెడ్డి, రంగాపురం సర్పంచి గండికోట వీరభద్రరావు, ఆర్ఎస్ పేట భీమన్న, తోటపేట మల్లిబాబు, వసై సత్తిబాబు, కొరుకోండ నాగేశ్వరరావు, తాళ్ల నీరంజన్ రెడ్డి, పందలపాక యాసలపు శ్రీనివాస్, కర్రి ఇస్రారెడ్డి, తొండాపు కాశీ, మాజీ ఎంపీటీసీ నెక్కల రామారావు, ఇ.సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా!



రఘుదేవపురంలో చెరువును తలపిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిన గోతులను తాత్కాలికంగా పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాతేరు – సీతానగరం ఆర్అండ్‌బీ నాలుగు లేన్ల రోడ్డు పనులు రఘుదేవపురం శివారు వరకూ పూర్తయ్యాయి. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ రెండు కిలోమీటర్ల మేర రోడ్డు శిథిలమై గోతులు పడి వాహన చోదకులకు నరక ప్రాయంగా మారింది. నిత్యం ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజుల క్రితం రోడ్డుపై పడిన గోతుల్లో పెద్ద రాళ్లతో చప్తు వేశారు. వర్షాలకు చప్తు కొట్టుకుపోయి, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులను తప్పించే క్రమంలో వాహనాలు ఢీకొని పలువురు ఆసుపత్రి పాలవుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి 10 గంటలకు రఘుదేవపురం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో గోతులను తప్పించే క్రమంలో ఆటో, మోటారు సైకిల్ ఢీకొని గాయాలపాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలైనా ఇంత వరకూ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు.

అధినేతతో భేటీ





మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దుర్గారెడ్డి, విజయారెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయారెడ్డి, అనపర్తి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్యులు నిరంతర విద్యార్థులు కావాలి

- ఏపీ మెడికల్ సర్వీసెస్ చైర్మన్ శ్రీనివాసరావు
- జీఎస్ఎల్ ఆస్పత్రిలో వైద్యులకు సన్మానం



అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ఆర్ఎంపీలు

రాజానగరం: వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులే కాకుండా వైద్యులు కూడా ఆధునిక చికిత్స విధానాలను నేర్చుకోవడంలో విద్యార్థులుగానే అవగాహన పెంచుకోవాలని ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవంతో పాటు డాక్టర్స్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ కేవీజీఎస్ మురళీ కృష్ణ, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ సాధనతోనే ఏదైనా సాధించవచ్చన్నారు. అల్లవరంలో డాక్టర్ బసవ వరహాలు 56 ఏళ్లు, తణుకులో డాక్టర్ టి.రామబ్రహ్మం 40 ఏళ్లు రోగులకు సేవలందించారంటూ, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు వైద్య ప్రముఖులను జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

బీవీబీలో..

డాక్టర్ డే సందర్భంగా నామవరంలోని భారతీయ విద్యాభవన్ (బీవీబీ)లో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ వీవీ సత్యప్రసాద్ అడబాల, డాక్టర్ విక్రమ్‌లను విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ వైద్యులు చిన్నారులకు దంత పరీక్షలు చేసి, దంత సంరక్షణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ రాయ్ సేవలు ఆదర్శనీయం

పెదపూడి: ప్రజా వైద్యుడిగా విశేష సేవలందించి, వైద్య రంగంలో భారతరత్న అవార్డు పొందిన పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బీసీ రాయ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ సూర్య మెంటర్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు ముందుగా స్థానిక రామకృష్ణారెడ్డి నర్సింగ్ హోమ్ ప్రజా వైద్యులు కోనాల తమ్మిరెడ్డి, కోనాల నరసింహరెడ్డి, లక్ష్మి తులసి రెడ్డి, కార్తికేయ నర్సింగ్‌హోమ్ వైద్యుడు ద్వారంపూడి వీర్రాఘవరెడ్డిలకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, మెమెంటోలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అలాగే రామకృష్ణారెడ్డి నర్సింగ్ హోమ్ వ్యవస్థాపకుడు కోనాల రామకృష్ణారెడ్డి విగ్రహానికి ఆయన తనయులు తమ్మిరెడ్డి, నరసింహరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ద్వారంపూడి భాస్కరరెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పైన గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, సుబ్బారెడ్డి, నల్లమిల్లి అనంత కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు

అనపర్తి: ప్రముఖ వైద్యుడు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు డాక్టర్ డే శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీఏఆర్ స్కూల్ విద్యార్థులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

అనపర్తి: కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనపర్తి, బిక్కవోలు, రాయవరం మండలాల అధ్యక్షుడు వాసంశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. అనపర్తిలో సీనియర్ వైద్యుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, డాక్టర్లు టీవీఎస్ఎన్ రెడ్డి, జగన్మోహనరెడ్డి, సునీల్ రెడ్డి, బాధవి, స్వర్ణలత, రమాదేవి, ఏఎస్ఎన్ మూర్తి, రాయవరానికి చెందిన జీఎస్ఎన్ రెడ్డి, జి.గోపితేజరెడ్డి, జి.ప్రత్యూష, టి.నవీన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల మండల కార్యదర్శి డి.సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, పి.బాల సుబ్రహ్మణ్యం, సీహెచ్ జగదీష్, ఎల్.శ్రీనివాస్, ఎస్.బాలు, కేవీజీవీకే రెడ్డి పాల్గొన్నారు.



రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో డాక్టర్ కర్రి రామారెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు



భారతీయ విద్యా భవన్‌లో వైద్యుడిని సన్మానిస్తున్న దృశ్యం



జి.మామిడాడలో డాక్టర్ తమ్మిరెడ్డికి శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తున్న రాజారెడ్డి



డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సత్కారం



గుమ్ములూరు హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడు, పీడీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోరుకొండ: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చేసే కృషి అభినందనీయమని గుమ్ములూరు హైస్కూల్ హెచ్ఎం గంగాభవాని అన్నారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు హేమంత్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) నూకరాజులు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పీడీ టీనూకరాజు ఎందరో విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారన్నారు. హేమంత్ కుమార్ హిందీ బోధన ద్వారా విద్యార్థులను ప్రయోజకులను చేశారన్నారు. అనంతరం వారిద్దరినీ శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే బూరుగుపూడి హైస్కూల్‌లో హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వీవీఎస్ఎస్ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు సత్కరించారు.

సువర్ణ వర్తకుల సంక్షేమానికి కృషి



సమావేశానికి హాజరైన ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: సువర్ణ వర్తకుల సంక్షేమం, భద్రతకు సువర్ణ వర్తక సంఘం నిరంతరం పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. గుండువారి వీధిలోని సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపంలో మంగళవారం నగరంలోని సువర్ణ వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నెబో కంపెనీ రీజినల్ మేనేజర్ దుప్పాల సుధీర్ మాట్లాడుతూ బంగారం, వజ్ర ఆభరణాలు వంటి విలువైన వస్తువులే కాకుండా విలువైన డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు గన్నెబో స్టీలేజ్ లాకర్లు నమ్మకమైనవన్నారు. జ్యూయలరీ సంస్థలు తమ ఉత్పత్తులను సురక్షితంగా ఉంచుకోవడానికి బీఐఎస్ సర్టిఫికేషన్ కలిగిన సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఏదైనా చోరీ, అగ్ని ప్రమాదం సంభవించినా బీమా పరిష్కారం కావాలంటే టార్స్ అండ్ టూలా (టీఆర్‌టీఎల్) రెసిస్టెన్స్ గల సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, కార్యదర్శి గంటా ప్రకాష్, గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, రాష్ట్ర సువర్ణ వర్తక సంఘం కార్యదర్శి దొండపాటి జయసింహ, సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపం అధ్యక్షుడు బొద్దు రామారావు, వెత్సా బాబ్జీ, సప్పా వెంకటరమణ, లక్కోజి వీరభద్రరావు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం దైవ కార్యం



చిన్న వెంకన్నబాబును సత్కరిస్తున్న పట్టాభి శాస్త్రి

సీటీఆర్ఐ: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దైవ కార్యంతో సమానమని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మన గుడి, మన సేవ ఉభయ రాష్ట్రాల ఆధ్యాత్మిక సేవా పురస్కారం, రాజహంస పురస్కార గ్రహీత జి.సుబ్రహ్మణ్య పట్టాభి శాస్త్రి శాలువతో చిన్న వెంకన్నబాబును సత్కరించారు. నగరంలోని సుమారు వెయ్యి మంది అనాథలు, యాచకులు, వృద్ధులకు అన్న వితరణ చేశారు. గాడాల గ్రామంలోని పీఠంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరోపకారం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మాత్రమే అది సాధ్యమన్నారు. ఆషాఢ మాసంలో వారాహి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల విశేష పూజాఫలం దక్కుతుందన్నారు.

ఎల్ఐసీ జాతీయీకరణలో ఏఐఐఈఏ పాత్ర కీలకం

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ జాతీయీకరణలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రముఖ పాత్ర పోషించిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. ఆ యూనియన్ ఏర్పడి 75వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆవిష్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు మాథ్యూస్ యూనియన్ పతాక ఆవిష్కరణ చేసి, సంఘ ఆవశ్యకతను తెలిపారు. కోదండ రామ్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రభుత్వ రంగంలో ఉండటం వల్ల ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడంతో పాటు, కోట్లాది పాలసీ దారులు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ సేవలు అందిస్తోందన్నారు. అనంతరం సభ్యులందరికీ చేత సంఘం ఐక్యత కాపాడతామని, ప్రతిజ్ఞ చేయించారు. ఏఐఐఈఏ ప్లాటినమ్ జూబ్లీ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మహిళా కన్వీనర్ చేతుల మీదుగా నిర్వహించారు. కాగా.. ఈ నెల 9వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.